తానూర్ తహసీల్దార్‌గా మహేందర్‌నాథ్



తానూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తానూర్ మండల నూతన తహసీల్దార్‌గా మహేందర్‌నాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన లింగమూర్తి పదవీవిరమణ పొందడంతో నెన్నెల మండల నుంచి మహేందర్‌ను తానూర్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతించారు.



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఇదే

యూడీఏ ప్రతిపాదనలకు మోక్షం ఎప్పుడో?

- ఏడాది దాటినా ఇప్పటి వరకు కనిపించని పురోగతి
- మాస్టర్ ప్లాన్లు పకడ్బందీగా అమలుకు అవకాశం
- మౌలిక సౌకర్యాలపై ఆశలు
- కాగితాలకే పరిమితమవుతున్న ప్రకటనలు

నిర్మల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ తరహాలోనే ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో కూడా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు (యూడీఏ) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ మేరకు మొదట మూడు జిల్లాల అథారిటీల ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్లు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపింది. ఆదిలాబాద్ జిల్లాలో అవుడా, మంచిర్యాల జిల్లాలో మూడా, నిర్మల్ జిల్లాలో 'నుడా' పేరిట ఈ అర్బన్ అథారిటీలు ఏర్పాటు చేయాలని తలపెట్టారు. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలను కూడా ఈ అథారిటీల పరిధిలోకి చేర్చుతూ ప్రతిపాదనలు రూపొందించారు. ప్రభుత్వం సైతం మొదట అర్బన్ అథారిటీలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి తమకు పంపాలని సంబంధిత కలెక్టర్లను కోరింది. దీంతో కలెక్టర్లంతా ఆగమేఘాల మీద అథారిటీల ఏర్పాటుకోసం సంబంధిత అధికారులతో సమీక్షలు జరిపి ప్రతిపాదనలను రూపొందింపజేశారు. ఈ ప్రతిపాదనలను రూపొందించి ఏడాది దాటుతున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను సీరియస్‌గా పరిశీలించకపోవడంతో పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడి మాదిరిగానే ఉంది.

పక్కాగా మాస్టర్ ప్లాన్ అమలు..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు అయితే మున్సిపాలిటీలలో మాస్టర్ ప్లాన్ పక్కాగా అమలువుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అమలవుతున్న మాస్టర్ ప్లాన్ గడువు తీరిపోయినప్పటికీ వివిధ పరిపాలన సంకేతిక కారణాలతో అదే మాస్టర్ ప్లాన్‌ను కొనసాగిస్తున్నారు. ప్రస్తుత మాస్టర్‌ప్లాన్ అమలు వ్యవహారంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఇండస్ట్రియల్, కమర్షియల్ జోన్‌ల విషయంలో వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇండస్ట్రియల్, కమర్షియల్ జోన్‌లో అనుమతులు లేకుండానే గృహ నిర్మాణాలు సైతం పెద్దఎత్తున జరిగాయి. నిర్మల్ మున్సిపాలిటీలో చాలాచోట్ల నిజాయితీగా ఇళ్లు నిర్మించుకునేవారికి కమర్షియల్ జోన్ కారణంగా అనుమతులు లభించడంలేదు. అయితే కొత్తగా రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదనలలో ఇండస్ట్రియల్, కమర్షియల్ జోన్‌ల మార్పు వ్యవహారం దుమారం రేపుతోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పడితే కొత్త మాస్టర్ ప్లాన్‌లు రూపొంది ఆ మాస్టర్ ప్లాన్‌లు పకడ్బందీగా అమలు అయ్యే అవకాశం ఏర్పడనుంది. దీంతో ఇండస్ట్రియల్, కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌ల విషయంలో ఏర్పడే అన్నిరకాల వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

> **ఎలాంటి ఆదేశాలు రాలేదు..**
>
> **జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, నిర్మల్**
>
> 
>
> జనాభా ప్రాతిపదికన పెద్దపట్టణాల్లోని మున్సిపాలిటీలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కిందికి తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడిజిల్లాలో ఆదిలాబాద్‌తోపాటు నిర్మల్ మున్సిపాలిటీని కూడా ఎంపిక చేశారు. కానీ ఇప్పటివరకు నిర్మల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి గైడ్‌లైన్స్ గానీ, ప్రభుత్వ ఆదేశాలు గానీ రాలేదు.



పెద్దఎత్తున మౌలిక సౌకర్యాల కల్పన

కాగా మూడు జిల్లాల్లో ఏర్పడనున్న అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా దీని పరిధిలోని వచ్చే గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున మౌళిక సౌకర్యాల కల్పన జరగనుంది. ముఖ్యంగా ఇక్కడ మాస్టర్ ప్లాన్ అమలు పకడ్బందీగా జరగనుంది. దీనికోసం ఆయా జిల్లాల్లో కొత్త మాస్టర్ ప్లాన్‌లు రూపొందించాల్సి ఉంటుంది. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాల రోడ్లను లింకేజీ చేయడం, తాగునీటి సౌకర్యం కల్పించడం, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో పాటు సాటిలైట్ టౌన్ షిప్‌లను ఏర్పాటు చేయడం అథారిటీల ప్రధాన బాధ్యతగా నిర్ధారించారు. మూడు జిల్లాల్లోని మున్సిపాలిటీలను భారీ సంఖ్యలో గ్రామ పంచాయతీలను వీటి పరిధిలో తీసుకువస్తున్నారు. నిర్మల్ జిల్లాలో గ్రామ పంచాయతీలను నుడా పరిధిలో చేర్చుతూ ప్రతిపాదనలను రూపొందించారు.

అమలుకు జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల అమలుకు జిల్లాస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రతిపాదనలు రూపొందించారు. ఈ కమిటీలకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్లు, అలాగే మెంబర్‌లుగా వ్యవహరించనున్నారు. కాగా రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ నియమించే ఓ నామిని, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నియమించే మరో నామిని, డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ నియమించే నామిని సభ్యులుగా కొనసాగనున్నారు. అయితే ఈ కమిటీల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు సైతం ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


సమావేశానికి హాజరైన అధికారులు, రైస్‌మిల్లర్లు

సీఎంఆర్ డెలివరీ ప్రక్రియను వేగంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ రూరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (రెవె న్యూ) కిషోర్ కుమార్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైస్‌మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 2023-24కి గానూ సన్నరకం వరిధాన్యాన్ని మిల్లింగ్ చేయడానికి మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 32,200 టన్నుల సన్నవరి ధాన్యాన్ని మిల్లింగ్‌చేసి జూలై 27లోపు ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. మిల్లర్ల వారీగా సీఎంఆర్ మిల్లింగ్ పురోగతిని సమీక్షించిన అదనపు కలెక్టర్ డెలివరీని కాలపట్టిక ప్రకారం పూర్తిచేయని మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే వెనుకబడిన మిల్లర్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లామేనేజర్ సుధాకర్, అధికారులు, రైస్‌మిల్లర్లు ఉన్నారు.

పోక్సో కేసులో ఒకరికి నాలుగేళ్ల జైలు

నిర్మల్‌రూరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): 13ఏళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు, ఫోక్ ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయమూర్తి శ్రీవాణి తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. సోన్ మండలంలోని జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన దుమ్మల శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన ఓ 13ఏళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై సోన్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడికి శిక్ష విధించారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుంచి తప్పించుకోలేరని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.వినోద్‌రావు, విచారణ అధికారి ఎండీ ఆసిఫ్ (ఎస్సై), డ్యూటీ ఆఫీసర్ ఏఎస్సై డబ్ల్యు సింగ్, భాస్కర్, ప్రభాకర్, హెచ్‌సీలను, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

చామన్‌పెల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

లక్ష్మణచాంద, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ మహారాష్ట్రలో తన రాజ్యాన్ని ఏర్పాటుచేసి మొట్టమొదటి శూద్ర చక్రవర్తిగా శూద్రసామ్రాజ్య నిర్మాతగా అవతరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంచాలకులు దిగంబ రావు, నాయకులు ఎన్‌టీ రాజేశ్వర్, ఏలేటి గంగారెడ్డి, కొమ్మోజి నవీన్, బ్రహ్మాయ్య, విజయ్, బొమ్మెన రాజేందర్, అయిట్ల శ్రీనివాస్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

నేడు బాసరలో మంత్రుల పర్యటన

- సరస్వతీ ఆలయాల వద్ద నూతన భవనాల ప్రారంభోత్సవం
- ట్రిపుల్‌ఐటీ సందర్శన
- హరితహారంలో పాల్గొననున్న కొండా సురేఖ, జూపల్లి కృష్ణరావు


మంత్రులు ప్రారంభించనున్న బాసర దేవస్థాన నూతన కార్యాలయ భవనం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్జీయూకేటీ వీసీ గోవర్ధన్, ఓఎస్‌డీ మురళీదర్శన్





బాసర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాసరకు శనివారందేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి, ఎక్సైజ్‌శాఖ, టూరీజం మంత్రి జూపల్లి కృష్ణరావు రానున్నారు. ఆర్జీయూకేటీతో పాటు సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించనున్నారు. హెలిక్యాప్టర్‌లో ఉదయం 11గంటల ప్రాంతంలో బాసరకు చేరుకోనున్న మంత్రులు ట్రిపుల్‌ఐటీ హెలిప్యాడ్‌నుంచి బాసర అమ్మవారి ఆలయానికి చేరుకోనున్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద సుమారు రూ. 12కోట్లతో నిర్మించిన దేవస్థాన నూతన కార్యాలయ భవనం, అధునీకరించిన వంద గదులు భక్తుల వసతి గృహాన్ని ప్రారంభించనున్నారు. అమ్మవారి దేవస్థాన మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన ప్రాణాళికను పరిశీలించనున్నారు. అనంతరం ట్రిపుల్‌ఐటీలో జరిగే వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటనున్నారు. 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బాసరలో గడుపనున్నారు.

• ఏర్పాట్ల పరిశీలన

ఇద్దరు మంత్రుల పర్యటన సందర్భంగా అధికారులు అన్నిఏర్పాట్లు చేశారు. హెలిప్యాడ్‌ను ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సిద్ధంచేశారు. వనమహోత్సవాల కోసం మొక్కలను ఇతర వాటిని అందుబాటులో ఉంచారు. మంత్రుల ఏర్పట్లను వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ పర్యావేక్షించారు. అదే విధంగా అమ్మవారి వద్ద సైతం దేవస్థాన అధికారులు ముందస్తు ఏర్పాట్లుచేశారు. సొంతశాఖ మంత్రి వస్తుండడంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకుంటున్నారు. మరో పక్క పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక


మాట్లాడుతున్న ఫైనాన్ మేనేజర్

నిర్మల్‌రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక గురించి ఫైనాన్స్ మేనేజర్ సీడీఎంఏ శ్రీపాద రాజేశ్వర్ అధికారులు అందరితో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ రోజు చేయవలసిన పనులను ఆ రోజులలో చేయాలని సూచించారు. పారిశుధ్యం, నీటి సరఫరా, మెప్మా, రెవెన్యూ, భవన నిర్మాణ విభాగము సెక్షన్ల కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కుంటాల ఎంపీడీవోగా వనజ బాధ్యతల స్వీకరణ



కుంటాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కుంటాల మండల ఎంపీడీవోగా అల్లాడి వనజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా మెండోరా ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన అల్లాడి వనజ అక్కడి నుంచి బదిలీపై కుంటాల మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా మండలంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని ఆమె పేర్కొన్నారు.

నేడు ఖానాపూర్‌లో మెగా జాబ్‌మేళా

- ఆన్‌లైన్‌లో 3వేల మంది దరఖాస్తు
- ఉపాధి కల్పించడమే లక్ష్యం : జాన్సన్ నాయక్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాన్సన్ నాయక్

ఖానాపూర్,జూలై11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళా నేడు (శనివారం) మండల కేంద్రంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో జరగనుంది. ఈ జాబ్‌మేళాకు 600లకు పైగా ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నట్లు జాన్సన్ నాయక్ వెల్లడించారు. శుక్రవారం ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాకు ఇదివరకే ఆన్‌లైన్‌లో 3వేలకు పైగా నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ జాబ్‌మేళా ద్వారా నియోజకవర్గంలోని 8మండలాలకు చెందిన 600 మంది నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు దక్కనున్నట్లు జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. 60కి పైగా రాష్ట్రంలోని ప్రఖ్యాత కంపెనీలలో పనిచేసే అవకాశం యువతకి దక్కనుందన్నారు. ఈ జాబ్‌మేళాను ప్రతీ ఏడాది జూలై మొదటి రెండు వారాల్లో నిర్వహిస్తామని జాన్సన్ పేర్కొన్నారు. వచ్చే అభ్యర్థులందరికీ సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొక్కుల ప్రదీప్, తోట సుమిత్, సుమన్, నరేందర్‌రెడ్డి, సాబీర్, మహిపాల్, తదితరులున్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు నిరంతరం వైద్యపరీక్షలు

- ఎమ్మెల్యే రామారావుపాటిల్

తానూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాలశక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిరంతరం కొనసాగించాలని ఎమ్మెల్యే పవార్ రామరావుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని భోసి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య, ఆర్థిక, సామాజిక సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించేందుకు బాలశక్తి కార్యక్రమం ప్రత్యేకంగా అమలు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికి వైద్యపరీక్షల నిర్వహణ నిరంతరం కొనసాగించాలని, హెల్త్‌కార్డులు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అనారోగ్య సమస్యలున్న వారికి ప్రత్యేక పోషకాహారం, మందులు అందించాలన్నారు. విద్యార్థుల పోషకులతో సమావేశాలు నిర్వహించివారి ఆరోగ్య స్థితిగతులను తెలియజేయాలన్నారు. సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతరఅంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నాంలో భోజనంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అదేవిధంగా బీసీహాస్టల్‌ను సందర్శించి రూ.27లక్షల నిధులతో ప్రహరీ నిర్మాణానికి అడిషనల్ కలెక్టర్‌తో కలిసి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, వైద్య బృందం, విద్యార్థులు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలున్నారు.

జిల్లా సగటు వర్షపాతం 2.04 మి.మీ.

నిర్మల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం నాటికి జిల్లా సగటు వర్షపాతం 2.04 మిల్లీమీటర్లు కురవగా జిల్లాలో అత్యధికంగా కడెం మండలంలో 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన కడెం, గడ్డెన్న వాగు, స్వర్ణ ప్రాజెక్టులో ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది.

ర్యాగింగ్ పాల్పడితే క్రిమినల్ కేసులు: ఎస్సై

సారంగాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని చించోలి(బీ) గ్రామసమీపంలో గల మహాత్య గండి జ్యోతిభాపూలే బీసీ సంక్షేమ బాలుర డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ర్యాగింగ్ వ్యతిరేకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా కాలేజీలో చేరే విద్యార్థులతో స్నేహపూర్వకంగా కలిసిమెలసి ఉండాలని మానసిక, శారీరక ఒత్తిడి కలుగ చేయరాదని అన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులను కళాశాల యాజమానులు కళాశాల నుంచి సస్పెండ్ చేయిస్తామన్నారు. కళాశాలలో ర్యాగింగ్ జరగకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాలని తెలిపారు. ప్రతీ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ సెల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ర్యాగింగ్, విద్యార్థుల జీవన విధానాన్ని దెబ్బతీస్తుందని, ఎవరైనా ర్యాగింగ్‌కి పాల్పడితే డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ప్రేమ్ సింగ్, వినోద్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులున్నారు.


విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగామన కల్పిస్తున్న ఎస్సై

'విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి'

నేరడిగొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని జడ్పీహెచ్ఎస్ తేజాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మణిలత అన్నారు. శుక్రవారం కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల నిర్వహణకు అవసరమైన కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంప్లెక్స్‌కు చెందిన పాఠశాలలు నిర్వహిస్తున్న తీరును అభినందించారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఇల్లు నిర్మాణాన్ని అడ్డగించిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): బెదిరింపులకు పాల్పడి ఇళ్ల నిర్మాణ పనులకు అడ్డగించిన మాజీ కౌన్సిలర్ భర్త సోమరవిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సునిల్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన అయుష్ మఖారియా బ్రహ్మణవాడకు చెందిన వ్యాపారవేత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ కౌన్సిలర్ భర్త సోమ రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే మరో నిందితుడు డీవీఆర్ అంజనేయులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కాగా వీరిద్దరు బాధితున్ని తీవ్రమైన వేదనకు గురి చేసి అతని వద్ద నుంచి రూ.90వేలు బలవంతంగా వసూలు చేసిన ఘటనలో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం వీరిద్దరు అనేక తప్పుడు ఫిర్యాదులను మున్సిపాలిటిలో సమర్పించి ఆయుష్ మఖారియా సొంతంగా కలిగిన ఆస్థి పై మ్యూటేషన్,బిల్డింగ్ అనుమతులను అడ్డుకున్నారని తెలిపారు. వారి తప్పుడు ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలంటే రూ.6లక్షలు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేస్తూ ముందుగా రూ.90000 తీసుకున్నారని బాధితుడు తెలిపారు. వీరి చర్యల వల్ల తీవ్ర మానసిక వేదింపులకు గురైనట్లు పేర్కొన్నారు. బాధితుడు డీవీఆర్ అంజనేయులుతో మాట్లాడిన ఆడియో రికార్డును సమర్పించడమేకాకుండా అతను అట్రాసిటీ కేసులు పెట్టుతానని భయపెట్టినట్లు పేర్కొన్నాడు. అంజనేయులు ఇతరులను పంపి బెదిరింపులు చేయించడం, ఒప్పందానికి నొచ్చకపోతే శారీరక దాడులకు పాల్పడే ప్రమాదం ఉన్నట్లు తెలిపారు. తన కుటుంబంపై జరిగిన ఈ అక్రమమైన హింసాత్మక చర్యలపై చర్యలు తీసుకుని సోమరవి, డీవీఆర్ అంజనేయులు పై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలు మళ్లీ జరగకుండా నివారించాలని పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించారని సీఐ బి.సునిల్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన

బోథ్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల పైన శుక్రవారం సుభాష్ చంద్ర బ్రాహ్మణ కార్యదర్శి పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. రానున్న ఎన్నికలలో చేపట్టాల్సిన వివిధ పనులపై అవగాహన కలిగించారు. గ్రామాల్లో ఓటర్లలో నమోదు పూర్తి అవుతుంది. త్వరలోనే రిజర్వేషన్ల వివరాలు రానున్నందున ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తలమడుగు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మదనా పూర్ శివారు ప్రాంతంలోని వ్యవసాయ బావిలో ఓ మహిళ మృతదేహం లభ్యమయ్యింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని మదనా పురం గ్రామ సమీపంలో దాసరి నరేందర్ వ్యవసాయ పొలంలో శుక్రవారం మహిళ మృతి దేహం కనబడడంతో వెంటనే గ్రామస్థులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా తలమడుగు తహసీల్దార్ రాజమోహన్ సంఘటన స్థలానికి చేరుకొని బావిలో గల మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలు ఇంద్రవెల్లి గ్రామానికి చెందినట్లుగా వాగ్మరి సుహాసిని గా కాగా గుర్తించారు. మావల మండలంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనిలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. కాగా తన భార్య సుహాసిని కనిపించడం లేదని భర్త ఈనెల తీౌన మావల పోలీస్ స్టేషన్ మిస్సింగ్ కేస్ పెట్టినట్లు సమాచారం. కానీ తమ కూతురిని హత్య చేసినట్లు మృతురాలు తండ్రి వాగ్మరి అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారని మావల సీఐ స్వామి తెలిపారు. కాగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అనిల్‌కుమార్ యాదవ్



హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

● పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్ యాదవ్

మావల, జూలై 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలును హర్షిస్తూ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఏఐసిసి ఆదేశాల ప్రకారం కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయి నుంచి జాతీయ స్థాయిలో పటిష్ఠం చేసేందుకే కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లా కమిటీ, మండల కమిటీ పదవుల్లో కాంగ్రెస్ సిద్ధాంతాల కోసం పని చేసిన వ్యక్తికే పదవులు వస్తాయన్నారు. ఇంతకు ముందుల పైరవిలా ద్వారా పదవుల నియామకం జరగదని స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాలు తెలుసుకున్నాక కార్యకర్తల అభీష్టం మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడి నియామకం జరుగుతుందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చాక బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మాట ఇచ్చి నిలుపుకున్నరన్నారు. అందులో భాగంగానే పీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్ గౌడ్‌ను నియమించారాని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెరిగాక మెజారిటీ స్థానాల్లో మహిళలు ఎమ్మెల్యేలు కాబోతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కే భవిష్యత్ ఉందని రానున్న స్థానిక సంస్థ ల ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి అత్యధిక స్థానాలు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

● పార్టీ పటిష్ఠతకు పాటు పడాలి : తాహెర్‌బిన్ అందాన్

క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి పార్టీని పటిష్ఠం చేసేందుకు కార్యకర్తలు పాటుపడాలని అన్నారు. కార్యకర్తలందరికీ అభిప్రాయాలు తెలుసుకున్నాక సంప్రదింపుల తర్వాతనే ఏఐసీసీ ఆదేశాల మేరకు జిల్లా కమిటీల నియామకం జరుగుతుందన్నారు. జిల్లా కమిటీ నియామకంలో ఏఐసిసి పెద్దలు పాల్గొంటారని తెలిపారు.

● ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కే ఉంది : ఎమ్మెల్యే బొజ్జు

ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు ఏ ఎన్నికలు వచ్చిన ఓటు అడిగే హక్కు కాంగ్రెస్ కే ఉందన్నారు. 10ఏళ్ల పాలనలో ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్‌కు, మతం పేరిట రాజకీయాలు చేసే బీజేపీ పార్టీకి లేదన్నారు. పార్టీ కష్ట కాలం నుంచి పని చేస్తూ పార్టీ జెండా మోసిన నాయకుడికే డీసీసీ పదవి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తహెర్ బిన్ హందాన్, ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ బోథ్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, శ్యామ్‌నాయక్, ఇంద్రకరణ్ రెడ్డి, గోక గణేష్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించండి'

బోథ్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామంలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు రోడ్డు ఎంతో అధ్వానంగా మారిందని విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు బీసీ సెల్ మండల అధ్యక్షుడు జిల్లా పంచాయతీ అధికారికి విన్నవించారు. పాఠశాలకు వెళ్లే రోడ్డు వర్షాల వల్ల బురద మయంగా మారిందని, ఫలితంగా విద్యార్థులు బురదలో నడిచి పోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. తక్షణమే బురద రోడ్డుకు మరమ్మతులు చేయాలని విన్నవించారు.

తపస్ సభ్యత్వం నమోదు ప్రారంభం

తలమడుగు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తలమడుగు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలలో (ఖోడద్, సుంకిడి, కూచులపూర్, ఉండం, ఝరి) సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు చేయించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సంఘ సభ్యులందరూ కృషి చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నింటినీ విద్యార్థులందరికీ అందేలా చూడాలని టీపీ యూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపిక్రిష్ణ సూచించారు. బదిలీలతో పాటు పదోన్నతులను చేపట్టాలని, నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బాధ్యులు వాసుదేవ్ ముండే, కృష్ణ సాగర్, నాందేవ్, నరేష్ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రత డ్రైవర్లదే : ఎస్సై

బోథ్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను తీసుకువెళ్లే ప్రతీ వాహన డ్రైవర్ వాహనాలను సురక్షితంగా నడిపి ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చాలని బోథ్ ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం బోథ్ బస్టాండ్‌లో ఆటో డ్రైవర్ వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. డ్రైవింగ్ చేసేవారు వాహనాలకు సంబంధించిన పేపర్లను, డ్రైవింగ్ లైసెన్స్‌ను తప్పనిసరిగా ఉంచుకోవాలని కోరారు. పరిమితి నుంచి ప్రయాణికులను తీసుకువెళ్ల వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

'బీఎల్‌వో సర్వేలు మినహాయించాలి'

తలమడుగు, జూలై 11(ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలకు కూడా సర్వేను అంగన్‌వాడీ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న మాట్లాడుతూ అంగన్‌వాడీలకు బియల్ఓ సర్వేలు మినహాయించాలని ఐసీడీఎస్ పరిధిలో ఉన్న పనులు మాత్రమే చేయించాలని తెలిపారు. బీఎల్‌వో సర్వేలు వారి పరిధి కాదని అన్నారు. గ్రామాలలో చదువుకున్న వారిని గుర్తించి ఈ సర్వేలు చేయించాలని కోరారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలకు మినయింపు ఇచ్చి ఇతరులకు పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళావతి, భాగ్యవతి, రాధ, అశ్విని కొత్మ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

తోక ముడిచిన.. కంత్రీగాళ్లు!

(5వ పేజీ తరువాయి...)

ప్లాట్లను విక్రయించి మళ్లీ అదనంగా డబ్బులను డిమాండ్ చేయడం, లాంటి బ్లాక్ మెయిల్ దందాలకు పాల్పడిన వారి పై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారు. ఇప్పటి వరకు పలు రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్యనేతలతో పాటు పలువురు వ్యాపారులు, బ్రోకర్ల పై చర్యలు తీసుకున్నారు. ప్రజలు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఒకరిద్దరు అధికారులపైనే చర్యలు తీసుకున్న పోలీసులు మిగితా అవినీతి అధికారుల జోలికి వెళ్లినట్లు కనిపించడం లేదంటున్నారు. అవినీతి అక్రమాలలో అధికారుల హస్తం ఉన్నట్లు స్పష్టమవుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అడవిలో చెట్లను నరికిన వ్యక్తి రిమాండ్

ఉట్నూర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ అటవీ రేంజి పరిధిలోని గొందిపటార్ అడవీ ప్రాంతంలో వ్యవసాయం కోసం చెట్లను నరికిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించామని రేంజ్ ఆఫీసర్ శిలానంద్ తెలిపారు. హస్నాపూర్ బీట్‌లోని గొందిపటార్ అటవీ ప్రాంతంలో వ్యవసాయం చేయడానికి హస్నాపూర్‌కు చెందిన నాంపల్లి రామేశ్వర్ చెట్లను నరికి సాగుకు సిద్ధం చేస్తుండగా పట్టుకున్నామని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గోపాల్‌నాయక్ తెలిపారు. ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించామని అన్నారు. అటవీ భూమిలో చెట్లను నరకవద్దని, అడవులు నరికితే శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఎఫ్ఆర్‌వో పేర్కొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం : అరెస్టు

ఆదిలాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రిమ్స్‌లో స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మహిళ వద్ద రూ.1.40 లక్షలు వసూలు చేసిన భూపాలపల్లికి చెందిన రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునిల్‌కుమార్ తెలిపారు. బాధితురాలు మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఉద్యోగం విషయంలో నిందితుడు వాయిదా వేస్తూ రావడంతో మోసపోయానని గ్రహించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. అక్రమ కార్యక్రమాలు నకిలీ దందాలు ప్రజలను మోసం చేసే ఎలాంటి వారిని విడిచి పెట్టేది లేదని, జిల్లా పోలీసు యంత్రాంగం కఠినచర్యలతో వారిని అణిచి వేస్తుందని హెచ్చరించారు. భూపాలపల్లికి చెందిన గజ్జే రాజ్‌కుమార్ అనే వ్యక్తి ద్వారా ఉద్యోగం వస్తుందని నమ్మి, ఆయన మాటలను నమ్మి మహేశ్వరి తన ఖాతా నుంచి జనవరి 12, 2021న ఎస్‌బీఐ ఖాతాకు రూ.లక్ష చెల్లించిందన్నారు. ఆ తర్వాత జూలై 27, 2021న రూ.40వేలు ఎస్‌బీఐ ఖాతాకు చెల్లించిందని తెలిపారు. మొత్తం కలిపి ఆమె ఆ వ్యక్తికి రూ.1,40,000 చెల్లించిందన్నారు. నిందితుడు ఉద్యోగం ఇప్పించే విషయంలో రోజురోజుకూ వాయిదా వేస్తూ వచ్చారని, చివరకు మార్చి 30, 2025న ఉద్యోగం ఇవ్వలేనని, డబ్బు తిరిగి ఇవ్వలేనని స్పష్టం చేశారు. కాగా, శుక్రవారం నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

ఇంద్రవెల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): తండ్రి మరణం కోల్కోలేక.. ఇటు కడుపునిప్పి భరించలేక యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని హర్కపూర్ కొలాంగూడ గ్రామంలో జరిగింది. ఎస్సై ఇ.సాయన్న, కుటుంబీకుల వివరాల ప్రకారం.. మండలంలోని హర్కపూర్ కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం గణేష్, అయ్యుబాయి దంపతుల కూతురు ఆత్రం హర్షిత(20) గతేడాది ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తండ్రి గతేడాది అనారోగ్యంతో మృతి చెందడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. అయితే, ఆమె గత కొంత కాలం నుంచి కడుపు నొప్పితో బాధఎడుతుంది. కాగా, శుక్రవారం తన ఇంట్లో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్‌కు సందర్శించి యువతి మృతికి గల కారణాలను కటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించారు. తల్లి ఆత్రం అయ్యుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. యువతి మృతి చెందడంతో హర్కపూర్ కోలాంగూడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

తాత్కాలిక కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

నిర్మల్ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక, శాశ్వత కుటుంబాన్ని నియంత్రణా పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రపంచ జనాభాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జనాభాతో వచ్చే సమస్యల పట్ల ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించడానికి ప్రతీ ఏడాది జూలై 11న జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్, కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ ఆశిష్‌రెడ్డి, డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్, డీపీవో రామచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాన్ని స్వచ్ఛ కల్లూర్‌గా తీర్చిదిద్దుకుందాం

కుంటాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని స్వచ్ఛకల్లూర్ గ్రామంగా తీర్చిదిద్దుకుందామని ఎస్‌బీఎం ప్రతినిధి ప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు గ్రామంలో ఆమె ప్రధాన వీధుల్లో పర్యటించారు. స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా కల్లూరు గ్రామం ఎంపికై గ్రామంలోని మురికి కాల్వలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఇంటి చుట్టూ, ఇంట్లో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామంలో చెత్త సేకరణ షెడ్డు, డంపింగ్ యార్డును పరిశీలించారు. అధికారులు ప్రజలకు వ్యక్తిగత శుభ్రతపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈమెవెంట ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శి, కారోబారి తదితరులు ఉన్నారు.

కేజ్‌వీల్ పల్టీ.. వ్యక్తి మృతి

కడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లంపల్లి గ్రామానికి చెందిన పెల్యారావుసింగ్ పొలంలో కేజ్‌వీల్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో పెల్యారావు సింగ్ (47) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడినికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ముథోల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజు తండాకు చెందిన సంతోష్ (42) పురుగుల తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రాజు తండాకు చెందిన సంతోష్ వ్యవసాయ కూలీ. గత నాలుగేళ్ల కిందట అప్పు చేసి తన కూతురికి వివాహం చేశాడు. అప్పులు ఎలా తీర్చలేకపోతున్నాననే మదనపడుతూ ఉదయం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 10గంటల ప్రాంతంలో మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

● సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి: రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్ కుమార్ యాదవ్



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్

నిర్మల్ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం నిర్మల్ పట్టణంలోని మారుతిఇన్ హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా స్థాయి మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని మంత్రివర్గం నిర్ణయించడం 'సామాజిక విప్లవానికి నాంది' అని అభివర్ణించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో చేసిన 'జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు' డిమాండ్‌ను దేశంలో తొలిసారిగా తెలంగాణలో అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులకు, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న కాంగ్రెస్‌కు బీసీలు అండగా నిలవాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో 22 శాతానికి కుదించిన బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచడం గర్వకారణమని చెప్పారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించిన కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. అందుకే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వటానికి తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నిర్మల్ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ అర్జుమ న్‌అలీ, నిర్మల్ జిల్లాకాంగ్రెస్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, అల్లూరి మల్లారెడ్డి, మాజీఎమ్మెల్యేలు రేఖ శ్యామ్‌నాయక్, విఠల్‌రెడ్డి, నారాయణ రావు పటేల్, మార్కెట్ ఛైర్మన్లు ఆనంద్‌రావు పటేల్, భీమ్‌రెడ్డి, అబ్దుల్‌హాది, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా మండలాల అధ్యక్షులు నర్సయ్య, ఒడ్నాల రాజేశ్వర్, మధుకర్‌రెడ్డి, గంగాధర్, నిర్మల్ జిల్లాలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పూజలు

ముథోల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం అభిషేకం, కుంకుమార్చన, శాకంబరిగా అలంకరణ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళలు ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో సంజీవ్, దుర్బార్‌నాగేష్, నాగనాథ్, తదితరులు ఉన్నారు.

గోశాలకు పశువుల తరలింపు

ఖానాపూర్, జూలై11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురవీధుల్లో సంచరిస్తున్న పశువులను మున్సిపల్ సిబ్బంది ఖానాపూర్‌లోని కాళికామాత గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి పట్టణంలోని రోడ్లపై సంచరిస్తున్న పశువులను గోశాలకు తరలిస్తామని మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫెరోజ్, సూపర్‌వైజర్ శంకర్‌లు తెలిపారు. పశువుల యజమానులు సకాలంలో స్పందించి గోశాలను సంప్రదిస్తే రూ.వెయ్యి జరిమానాతో వదిలి పెడతామని పేర్కొన్నారు. స్పందించని యజమానుల తాలూకు ఆవులను గోశాలకే వదిలి పెడతామని పేర్కొన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



యూరియా కోసం క్యూలో రైతులు

ముథోల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట శుక్రవారం యూరియా బస్తాల కోసం రైతులు వేకువజాము నుంచే బారులు తీరారు. పీఏసీఎస్‌కు 900 యూరియా బస్తాలు రావడంతో రైతులు తరలివచ్చారు. ఒక్కో రైతుకు ఐదు యూరియా బస్తాల చొప్పున సంబంధిత అధికారులు అందజేశారు. అయినా కొంతమందికి దొరకకపోవడంతో నిరాశ చెందారు.

రాజ్యసభ సభ్యుడికి ఘన స్వాగతం

నిర్మల్ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌కు జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ ఘనస్వాగతం పలికారు. శుక్రవారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో భాగంగా తొలిసారిగా నిర్మల్‌కు వచ్చేసిన మందాడి అనిల్‌కుమార్ యాదవ్ రాజ్యసభ సభ్యుడికి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంచిర్యాల చౌరస్తా నుంచి మారుతి ఇన్ హోటల్, మంజులాపూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

అనిల్‌కుమార్ యాదవ్‌ని కలిసిన జిల్లా నాయకులు

కడెం, జూలై11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా ముఖ్యకార్యకర్తల సమావేశంలో భాగంగా నిర్మల్‌కి వచ్చిన సందర్భంగా రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్‌కుమార్ యాదవ్‌ను నిర్మల్ జిల్లా నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌వర్మలు సన్మానించారు.

సారంగాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

సారంగాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల మురళీధర్‌రెడ్డి కంప్లెక్స్‌లో శుక్రవారం న్యూలక్ష్మీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ప్రవంతి, ఓంకారే నరేంద్ర 125మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

బీఎల్‌వోలకు శిక్షణ

ముథోల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని రైతు వేదికలో శుక్రవారం బీఎల్‌వోలకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ, తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ ఎస్. దేవేందర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు సలహా సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ పటేల్, జయరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

'42శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలి'

నిర్మల్‌రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడిల కుమార్‌గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య, రాష్ట్రసర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో బీసీపీఎఫ్, బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఎన్నికలకు ముందుచెప్పిన కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బీసీలకు రిజర్వేషన్ చట్టబద్ధత కల్పిస్తామని నమ్మపలికి బీసీల ఓట్ల ద్వారా గద్దెనెక్కి కాలయాపన చేస్తూ పార్టీ పరంగా ఇస్తామని చెప్పడం బీసీలను మోసం చేయడమేనన్నారు. హైదరాబాద్‌లో జరిగే క్యాబినేట్ సమావేశంలో 42శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టేట్ కార్పొరేషన్ ఛైర్మన్‌లలో కూడా 42శాతం బీసీలకు ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని బీసీ సామాజిక ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలను భాగస్వామ్యం చేసి ఈనెల 15న ఇందిరాపార్క్ దగ్గర 10వేల బీసీ బిడ్డలతో బీసీల మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాధర్నాకు బీసీల నుంచి అన్ని సంఘాలు, ప్రజలు, వార్డుమెంబర్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీల వరకు రాజకీయ పార్టీలకు అతీతంగా ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి పెద్దఎత్తున పాల్గొని మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గడిల కుమార్ గౌడ్, ప్రణీల్ చందర్, సుర్వి యాదయ్య, రవీందర్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ సుభాష్ రవు, సుప్ప ప్రకాష్, మారుగొండ రాము, లక్ష్మణచారి, పూదరి నరహరి, విశాల్, కపిల్, నయీం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ ఎస్పీని కలిసిన ఆర్ఎస్సైలు

నిర్మల్ రూరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌కార్యాలయంలో ఆర్మ్డ్ రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్సై)లు ఆన్-ఫీల్డ్ ట్రైనింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, శుక్రవారం ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి (అడ్మిన్)ని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సేవా అనేది ప్రజల రక్షణ కోసం, న్యాయం కోసం, క్రమశిక్షణ, జవాబుదారితనంతో కూడిన విధులు నిర్వహించడంతో పోలీస్‌శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పొందవచ్చని తెలిపారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

భైంసారూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): వనమహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భైంసా గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వమే కాదు, ప్రజలందరి బాధ్యత. విధిగా మొక్కలు నాటడమేకాకుండా వాటిని సంరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అదనపు కలెక్టర్



సోనాలలోని జడ్పీ ఉన్నత పాఠశాల

సోనాల జడ్పీ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువు

● 550 మంది విద్యార్థులకు ఆరు మూత్రశాలలు

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

బోథ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువులో రాణిస్తున్న వారికి అవసరమైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆడుకునేందుకు కావాల్సినంత ఆటస్థలం ఉన్న గదుల కొరత వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూత్రశాల లేకపోవడంతో విద్యార్థులు గురవుతున్నారు. ముఖ్యంగా 250 వరకు బాలికలు ఉండగా వారికి మూత్రశాల లేక సతమతమవుతున్నారు.



● మూత్రశాలలు లేక పాఠశాలకు గైర్హాజరు

మల్లేశ్వరీ, విద్యార్థిని

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూత్ర లేకపోవడంతో కొంత మంది విద్యార్థినులు పాఠశాలకు రావడం లేదని పదో తరగతి విద్యార్థిని మల్లేశ్వరి వాపోయారు. ఇంటర్ బెల్ సమయం లో మూత్రశాల వద్ద విద్యార్థులు క్యూ పెట్టాల్సిన పరిస్థితి ఏర్ప డిందని అంటున్నారు. మరో వైపు నూతనంగా ఏర్పడిన మండలంలో ఎంపీడీవో తహసిల్దార్ కార్యాలయాలకు మూత్రశాల లేకపోవడంతో ఆయా కార్యాలయాలలో పనిచేసే సిబ్బంది సైతం పాఠశాలల మూ త్రశాలను వినియోగిస్తున్నారు.



● మరో 10 మూత్రశాలలు నిర్మించండి

సచిన్ శర్మ, ప్రధానోపాధ్యాయుడు

తమ పాఠశాలలో మొత్తం 550 వరకు విద్యార్థులు ఉన్నారని అయితే విద్యార్థులకు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని చూస్తూనే ఉన్నామని పాఠశాల ప్రధానో పాధ్యాయులు సచిన్ శర్మ వాపోయారు. కొంత మంది విద్యార్థినులు మేం పాఠశాల రాము అంటూ గైరాజరుగుతున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు మూత్రశాలలను మంజూరు చేయాలని కోరారు.

జల కళలేని పొచ్చెర జలపాతం

బోథ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది వర్షాలు ఒక్కో ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండగా బోథ్ మండలంలో మాత్రం వర్షం ఆశించిన స్థాయిలో కురవడం లేదు. పంటలకు అనుకూలంగా ఉన్న భూగర్భ జలాలు మాత్రం పెరగడం లేదు. చిరుజల్లులే పంటలను కాపాడుతున్నాయి. దీంతో గ్రామాల సమీపంలోని వాగులు ఇంతవరకు పొంగి ప్రవహించలేదు. చెరువుల్లో సైతం కొత్తనీరు రాలేదని రైతులు అంటున్నారు. మరోవైపు జలపాతం వద్ద ఆశించిన స్థాయిలో నీటి దారాలు రాక ప్రకృతి ప్రేమికులను నిరాశ పరుస్తున్నది. ఏది ఏమైనా గత ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోగా ఈ ఏడాది ఏ విధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు భారీ వర్షాలు కురవక పోతే భూగర్భ జలాలు పెరగవని అంటున్నారు



వెలవెలబోతున్న కరత్వాడ చెరువు



పరవళ్లు తొక్కుతూ ఎగిసి పడుతున్న నీటి అలలు



దట్టమైన అడవి ప్రాంతంలో పెద్దగుండం జలపాతం



దిగువ ప్రాంతంలో ఉన్న గాయత్రి జలపాతానికి దాటి వెళ్లాల్సిన అడవి ప్రాంతం

అటవీ లోయలో అందమైన జలపాతాలు

● యాత్రికుల మనసు దోచుకునే పెద్దగుండం

● రహదారి సౌకర్యం లేక అవస్థలు

● పట్టింపులేని పర్యాటక శాఖ

ఇచ్చోడ, జులై 12 (ఆంధ్రజ్యోతి) : అడవుల జిల్లా ప్రకృతి సహజ వనరుల ఖిల్లా.. ఆదిలాబాద్ జిల్లాలో ఆకుపచ్చని గుట్టల పొదరిల్లు.. కొంగొత్త సోయగాల హరివిల్లు.. ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నో సహజ సిద్ధ అందాలు ఈ ప్రాంతానికే సొంతం. మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామ పరిధిలో గల పెద్ద గుండం జలపాతం, గుండివాగు గ్రామ సమీపంలో ఉన్న గాయత్రి జలపాతాల వద్ద యాత్రికులు సందడి చేస్తున్నారు. చుట్టు అడవి.. అడవి మధ్యలో పెద్దపెద్ద బండరాళ్లు.. బండరాళ్ల నడుమ పాలనురగల సోయగమే ఈ జలపాతాల ప్రత్యేకత. ఇన్నాళ్లు వెలుగులోకి రాని ఈ జలపాతాలను పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మరుగున పడిపోతు న్నాయి. యాత్రికుల మనసు దోచుకునే జలపాతాలుగా గాయత్రి, పెద్ద గుండంలోని ప్రకృతి అందాలు పర్యటక శాఖ అధికారులు, స్థానిక పాలకులు గుర్తించడం లేదని ఇక్కడి ప్రజలు అంటున్నారు. జలపాతానికి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక వాహనాలు దాదాపు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోనే మట్టిరోడ్డుపై నిలిపివేసి ఎడ్లబాటలో వేళ్లాల్సి వస్తుంది.

● ఇచ్చోడ మండలం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోకస్ మన్నూర్ గ్రామం నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో పెద్ద గుండం కలదు. ఇచ్చోడ మండల కేంద్రం నుంచి దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది.

● ఇచ్చోడ మండలం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండివాగు గ్రామం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో గాయత్రి జలపాతం కలదు. ఇచ్చోడ మండల కేంద్రం నుంచి దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. ఇకనైనా అధికారులు, పాలకులు ఈ రమణీయ ప్రదేశాన్ని గుర్తించి అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.



కోకస్ మన్నూర్ పెద్దగుండంగా పేరొందిన జలపాతం

పత్తిలో పెరుగుతున్న కలుపు

● కలుపు నివారణకు ప్రయత్నాలు ప్రారంభించిన రైతులు

ఉట్నూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు శుక్రవారం కాస్త ఎడతెరిపి లభించింది. ఎడతెరిపి లేని వర్షంతో ఏజెన్సీలోని రైతులు పండిస్తున్న పత్తి పంటలో కలుపు మొక్కలు తీవ్రంగా పెరిగాయి. ఉట్నూర్ మండలంలోని గన్‌పూర్, బీర్సాయిపేట, ధర్మాజీపేట్, బలాన్నూర్, రాంజీనగర్, కుమ్మరికుంట, తేజాపూర్, హీరాపూర్, దంతంపల్లి, చెరువుగూడ, మొర్రిపేట్, మస్నాపూర్, చందూరి, షాంపూర్, నాగాపూర్, లక్కేటిపేట, గంగాపూర్, కామాయిపేట్, సాలెవాడ తదితర గ్రామాలలోని రైతులు 24వేల ఎకరాలలో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఇదే మాదిరి ఏజెన్సీలోని ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాలోని రైతులు సైతం పత్తి పంటను అధిక శాతం సాగు చేస్తున్నారు. పత్తి పంటలు గడ్డి భాగా పెరిగి పోవడంతో కలుపు తీయడానికి కూలీల కోసం కొన్ని ప్రాంతాల రైతులు ఎదురు చూస్తున్నారు. కూలీలు అందుబాటులో ఉన్న రైతులు కలుపు తీయడానికి కూలీలను నియమించుకుని పత్తి పంటను కాపాడుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే యూరియాను నిలువ చేసుకున్న రైతులు ఎండలు కొడితే పత్తి పంటకు ఎరువులు కూడా వేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. పత్తి పంటను కాపాడుకోవడానికి పంటలో రైతులు నాగలితో డౌరా కొడుతుండగా మరికొందరు రైతులు కూలీలు లభించక పోవడంతో పత్తి పంటలు పెరిగిన గడ్డి నివారణ కోసం గడ్డి మందు పిచికారి చేస్తున్నారు.



పత్తి పంటలో కలుపు తీస్తున్న దృశ్యం



పత్తిలో దౌరా కొడుతున్న రైతులు



పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు

చిత్తడిగా పొలం బాట

● బేజారవుతున్న జనాలు ● వర్షాకాలం వచ్చిందంటే వణుకే..

● ప్రతీ యేటా తప్పని తిప్పలు ● జారి పడి ఆసుపత్రుల పాలవుతున్న రైతులు

దిలావర్‌పూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు నిత్యం పొలాలకు వెళ్లే రహదారి అధ్వాన్నంగా మారింది. రహదారి పరిస్థితిని అధికారులకు విన్నవించినా నిరాశే మిగులుతోంది. ఫలితంగా ఎంతో మంది రైతులు, వ్యవసాయ కూలీలు ఈ రహదారిపై జారిపడి ఆసుపత్రి పాలుఅవుతున్నారు. దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామ రైతులకు వర్షాకాలం వచ్చిందంటే చాలు పొలాలకు వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదు.

రెండు మండలాల లింక్ రోడ్డు..

ఇది కేవలం పొలాలకు వెళ్లే రోడ్డు మాత్రమే కాదు. దిలావర్‌పూర్ - సారంగాపూర్ మండలాలను అనుసంధానిస్తూ స్వర్ణ వాగుపై బ్రిడ్జిని నిర్మించారు. రెండు మండలాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలం రాగానే రోడ్డు ప్రమాదకరంగా మారుతుండటంతో ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు జంకుతున్నారు. పది కిలో మీటర్లు దూరం పెరుగుతున్నప్పటికీ చుట్టూ తిరిగి వస్తూ పోతున్నారు. అయితే కాల్వ రైతులకు మాత్రం ఇదే రహదారి దిక్కు. దీంతో రైతులు అవస్థలు పడుతూ కూడా పొలాలకు వెళ్లాల్సి వస్తోంది.

పడుతూ.. లేస్తూ.. నడుస్తూ వెళ్లడమే!

రైతులకు ఈ రహదారి తప్ప వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పడుతూ.. లేస్తూ.. నడవాల్సిందే. నల్ల రేగడి మట్టి కావడంతో చినుకు పడితే చాలు చిత్తడిగా మారిపోతుంది. కాలు తీసి కాలు పెట్టాలంటే సాహసం చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదుపు తప్పి కాలు జారి పడితే ఆసుపత్రికి వెళ్లాల్సిందేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు దుస్థితి ఎందుకిలా...

అసలే ప్రమాదకరంగా మారిన ఈ రహదారిపై స్వర్ణ వాగు నుంచి నిత్యం ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటం కూడా ఒక కారణమని రైతులు పేర్కొంటున్నారు. ఇసుక లోడుతో వెళ్తుండటంతో అసలే బురదగా ఉన్న రహదారి మరింత చెడిపోయి నడవలేని స్థితికి చేరిందని అంటున్నారు. రోడ్డు దుస్థితిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

పనులకు వెళ్లేందుకు కూలీలు నిరాకరణ..

ఈ రహదారి దుస్థితి కారణంగా వ్యవసాయ పనులకు వెళ్లేందుకు వ్యవసాయ కూలీలు నిరాకరిస్తుండటంతో రైతులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఒకరోజు కూలీకి వెళ్తే వచ్చేది రూ. 350 నుంచి రూ. 500లు కాగా జారిపడితే ఆసుపత్రికి వెళ్తే వేల రూపాయలు కావాలని కూలీలు పనులకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. దీంతో కలుపు తీత పనులు కుంటుపడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పొలం బాటకు నిధులు మంజూరు చేసి రహదారిని బాగుచేయాలని కాల్వ గ్రామస్థులు కోరుతున్నారు.



కాల్వ శివారులోని వ్యవసాయ భూములకు వెళ్లే దిలావర్‌పూర్ - సారంగాపూర్ మండలాల లింక్ రోడ్డు దుస్థితి



బెల్టు షాప్‌ను మూసి వేయించిన మహిళా సంఘ సభ్యులు

మద్యంపై మహిళల పోరాటం

● ఏజెన్సీ గ్రామాల్లో అమ్మకాలు జరిపితే భారీ జరిమానాలు ● ఆదర్శంగా నిలుస్తున్న ఆది వాసీ మహిళలు

● బెల్టు దుకాణాలు మూసి వేయాలని హెచ్చరిక

ఇంద్రవెల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం మహమ్మారికి యువత బానిస కావడంతో గ్రామాల్లో మహిళలు కొంగు నడుముకు చుట్టారు. మద్యం మహమ్మారిని పార దోలాలని నిర్ణయించుకున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే బెల్టు దుకాణంపై సమరం సాగించారు. మద్యం అమ్మకాలను అడ్డుకుని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. మండలంలోని వడ్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహిళలు. ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన గూడేల్లో యువతతో పాటు పెద్ద వారు సైతం మద్యానికి బానిసై ఆర్థికంగా, ఆరోగ్య పరంగా నష్టపోతున్నారు. వెంటనే పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో బెల్టు దుకాణాలను అరికట్టాలని పంచాయతీ పరిధిలోని మహిళల మంతా కలిసి మద్యం అమ్మితే జరిమానా విధించాలని తీర్మానించారు. ఆ గ్రామానికి చెందిన పలువురు మద్యం మత్తులో పనిచేసిన డబ్బులను మద్యానికి ఖర్చు చేస్తూ కుటుంబాలను పట్టిం చుకోవటం లేదు. దీంతో పంచాయతీ పరిధిలోని మహిళలంతా ఏకమై మద్యం మహమ్మారిని పారదోలాలని నడుం బిగించారు. వడ్‌గాం మహిళా సంఘం సభ్యులు ఆత్రం భీంబాయి, మెస్రం విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలంతా ఏకమై వడ్‌గాం గ్రామంలో బెల్టు దుకాణం బంద్ తీర్మానించారు. బెల్టు దుకాణాలు వద్దకు వెళ్లి మద్యం అమ్మొద్దని హెచ్చరించారు. పంచాయతీ పరిధి లోని అన్ని గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే రూ.50 వేలు జరిమానా కట్టాలని హెచ్చరించారు. మండలంలోని ఈశ్వర్ నగర్ గ్రామ సమీపంలోని ఉన్న జై దుర్గా వైన్ షాప్ యాజమాన్యానికి మా గ్రామాల్లో మద్యం నిషేధంపై చేసిన తీర్మానం అందజేసి, మా గ్రామానికి మద్యం సరఫరా చేస్తే మద్యం షాపును ముట్టడిస్తామని హెచ్చరించారు.

● మా ఊళ్లో బెల్టు షాపులు వద్దు



పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టుషాపులు వెలిశాయి. ఇటు అధికారులు కానీ.. అటు ప్రజాప్రతినిధులు కానీ.. పట్టించు కున్న పాపాన పోవడం లేదు. పచ్చని సంసారాలు పాడవుతున్నాయి. వేకువ జామునే బెల్టు షాపులు తెరిచి ఉంటున్నాయి. యువకులు తాడు గుకు బానిస అవుతున్నారు. ఉదయం లేవగానే చాయ్ తాగు తారో లేదో తెలియదు కానీ.. మద్యం మాత్రం తాగకుండా ఉండలేక పోతున్నారని, పని చేసిన డబ్బులు మొత్తం తాగుడుకు ఖర్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఆత్రం భీంభాయి, మహిళా సంఘం సభ్యులు

● యువతి మద్యానికి బానిసై



ఆదివాసీ గిరిజన గూడేల్లో యువత మద్యానికి బానిసై పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోంది. గ్రామాల్లో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. దీంతో పొద్దంతా పనిచేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు.

-మెస్రం విజయలక్ష్మి, మహిళా సంఘం సభ్యులు

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 24.8 : కనిష్ఠం 22.7



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

శనివారం 12 జూలై 2025



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలకం

● అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం తన చాంబర్‌లో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలకమన్నారు. నిధుల వినియోగంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. ప్రతీ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో రెండు ప్యాకేజీలకు సంబంధించి మొదటి ప్యాకేజీకి రూ.5.40 కోట్లు, రెండవ ప్యాకేజీకి రూ.5.10 కోట్లు నిధులతో బీటీ రోడ్లు, సీసీ రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్, తదితర పనులపై చర్చించారు. ఈ పనులను వచ్చే ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో ఈఈ రాజు, నరసింహారెడ్డి, డీఈలు, ఈఈలు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



◄ ● పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

తోక ముడిచిన.. కంత్రీగాళ్లు

- ఎస్పీ ఝలక్‌తో అడ్డగోలు దందాలకు బ్రేక్
- మహారాష్ట్రకు అడ్డా మార్చిన పేకాట, మట్కా జూదరులు
- రౌడీలు, పోకిరీల ఆగడాలకు చెక్ పెట్టడంతో పూర్తిగా సైలెంట్
- తప్పు చేయాలంటేనే జంకుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు
- ఇంకా తప్పించుకుంటూ తిరుగుతున్న అవినీతి అధికారులు
- పోలీసు చర్యలతో గాడిలో పడుతున్న జిల్లా పాలన

ఆదిలాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇన్నాళ్లు అడ్డగోలు దందాలు చేస్తూ అక్రమ సంపాదనకు ఎగబడిన పలువురు కంత్రీగాళ్లు కటకటాల పాలవుతున్నారు. గత కొద్దిరోజులుగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అక్రమ దందాలపై కొరడా ఝులిపించడంతో తోకముడిచి సైలెంటై పోతున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారికి వార్నింగ్ ఇవ్వడంతో క్రైమ్‌రేటు కూడా తగ్గుముఖం పడుతుంది. జిల్లా ఎస్పీగా బాధ్యత లు చేపట్టిన తర్వాత పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా మేసేజ్ యువర్ ఎస్పీ, ఆపరేషన్ చభుత్ర, యాంటీడ్రగ్ కమిటీలు, పోలీసులు మీ కోసం, షైట్యాక్సీ ఈజ్ సేఫ్ అనే కార్యక్రమాలతో జిల్లా పోలీసులు ప్రజల్లోకి దూసుకు పోతున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై ఉక్కుపాదం మోపుతూ ఎంతటి వారినైనా వదిలి పెట్టకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే నకిలీ జర్నలిస్టులు, బ్లాక్ మెయిల్‌కు పాల్పడిన జర్నలిస్టులపై కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపించిన దాఖలాలు ఉన్నాయి. గత కొద్ది రోజులుగా పోలీసులు చేపడుతున్న చర్యలతో జిల్లా పాలన గాడిలో పడుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పక్క రాష్ట్రానికి పరుగులు

ఎలాంటి అనుమతులు లేకుండా చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్న పేకాట, మట్కా జూదంపై జిల్లా పోలీసులు లాఠీ ఝులిపించడంతో జూదరులు బెంబేలెత్తి పోతున్నారు. జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరించడంతో పొరుగున ఉన్న మహారాష్ట్రకు పరుగులు తీస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలోని పాటన్‌బోరి, చంద్రాపూర్, కిన్వట్, పాండ్రకవడ, తదితర ప్రాంతాల్లో పేకాట శిబిరాలకు తరలివెళ్తున్నారు. జిల్లా నుంచి నిత్యం వందలాది మంది జూదరులు మహారాష్ట్రకు క్యూకడుతున్నారు. అక్కడ ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో పేకాట, మట్కా జూదంతో జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. అలాగే రోజంతా మందు విందులతో తెగ ఎంజాయ్ చేస్తున్నారు. పేకాట శిబిరాలను నిర్వహిస్తున్న నిర్వాహకులే జూదరులకు అన్ని సమకూరుస్తూ అదనంగా అడ్డగోలుగా దండుకుంటున్నారు. జిల్లా నుంచి కొందరు వ్యాపారులు, ఉద్యోగులు, రాజకీయ నేతలు కూడా ఖరీదైన కార్లలో పక్క రాష్ట్రానికి పరుగులు పెడుతున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా సారిస్తే జిల్లా నుంచి వెళ్తున్న జూదరులను కనిపెట్టే అవకాశం ఉందన్న అభిప్రాయాలున్నాయి.



తప్పు చేసిన అధికారులను వదిలి పెట్టేది లేదు

: అఖిల్ మహాజన్, జిల్లా ఎస్పీ, ఆదిలాబాద్



నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తూ తప్పు చేసిన ఎలాంటి అధికారులను కూడా వదిలి పెట్టేది లేదు. ఇప్పటికే కొంతమంది అధికారులపై చర్యలు తీసుకున్నాం. మరింత లోతుగా దర్యాప్తు జరుపుతున్నాం. జిల్లా సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలో పేకాట, మట్కా జూదం నిర్వహిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర పోలీసు అధికారులను కోరడం జరిగింది. జిల్లాలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగకుండా కఠినమైన చర్యలు తీసుకుంటున్నాం.

కత్తి చూపితే జైలుకే..

బహిరంగ ప్రదేశాలలో విచ్చలవిడిగా రెచ్చిపోతున్న గ్యాంగ్ ముఠాలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. బర్త్‌డే పార్టీలలో కత్తులు, తల్వార్లను చూపుతు ఫొటోలకు ఫోజులివ్వడం కొందరికి అలవాటుగా మారింది. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కత్తి చూపితే జైలుకే అంటూ హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కత్తులతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి హల్‌చల్ చేసిన వారిని అరెస్టు చేశారు. ముఖ్యంగా గ్యాంగ్‌లను నిర్వహిస్తున్న రౌడీల పై ప్రత్యేక నిఘాను సారిస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అడ్డగోలుగా వ్యవహరించే రౌడీల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఆల్ట్రేషన్ సైలెన్సర్లతో అధిక ధ్వని కాలుష్యానికి కారణమవుతున్నా పోకిరిల ఆట కట్టించారు. గత కొద్ది రోజుల క్రితమే ఆల్ట్రేషన్ బైక్ సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్‌తో నడ్డి రోడ్డుపై తొక్కించి పోకిరిల ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. అలాగే నిరంతరంగా వాహనాలను తనిఖీ చేస్తూ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ మోసాలకు చెక్

అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుంటు మోసం చేసే రియలిస్టేట్ వ్యాపారులకు పోలీసులు చెక్ పెడుతున్నారు. ఇప్పటికే నకిలీ డాక్యుమెంట్లతో భూములు, ప్లాట్ల విక్రయాలను జరిపిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. దీంతో తప్పు చేయాలంటేనే రియలిస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు జంకుతున్నారు. ప్లాట్ల డబుల్ రిజిస్ట్రేషన్‌తో పాటు కొనుగోలు చేసిన రిజిస్ట్రేషన్ చేయక పోవడం,

(తరువాయి 6వ పేజీలో...)



కళాకారులు, గ్రామస్థులతో జిల్లా అదనపు వైద్యాధికారి, వైద్యులు

రాపిడ్ ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి : కుడ్మెత

సిరికొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రాపిడ్ ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మెత మనోహర్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోచంపల్లి, తదితర గ్రామాల్లో రాపిడ్ ఫీవర్ సర్వే శిబిరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేలా కృషి చేయాలన్నారు. గ్రామాలలో అపరిశుభ్రత లోపించకుండా ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రాపిడ్ ఫీవర్ సర్వేలో భాగంగా ప్రతీ ఒక్కరి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వందశాతం ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. ఇందులో వైద్యులు డాక్టర్ రాథోడ్ ప్రతాప్‌నాయక్, హెచ్‌ఈవో నాందేవ్, హెల్త్ సూపర్ వైజర్ జలంధర్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

'అన్ని సర్వీసులు ట్రాన్స్‌ఫార్మర్ మీద మ్యాపింగ్ చేయాలి'

ఆదిలాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సర్కిల్‌లోని అధికారులతో టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.వరుణ్‌రెడ్డి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సర్వీసులు ట్రాన్స్‌ఫార్మర్ మీద మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈనెల 16 నుంచి 20మధ్య ఈ ప్రోగ్రామ్ అన్ని సెక్షన్ ఆఫీసులో ప్లాన్ చేసి చేపట్టాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న వంగిన విద్యుత్ పోల్స్, వదులుగా ఉన్న లైన్స్ ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు, తక్కువ ఎత్తు ఉన్న లైన్స్‌లను గుర్తించి వెంటనే సరి చేయాలన్నారు. 33 కేవీ, 11 కేవీ లైన్స్ పెట్రోలింగ్ చేసి సమస్యలను గుర్తించి వాటిని సరి చేసి అంతరాయాలను తగ్గించాలని పేర్కొన్నారు. డిష్ కేబుల్, ఇంటర్నెట్ కేబుల్ ఆపరేటర్స్ వాడుతున్న పోల్ చార్జెస్ కట్టని వారి నుంచి వెంటనే వసూలు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ సర్వీసులు వెంటనే రిలీజ్ చేయాలని, అన్ని మండలాల అసిస్టెంట్ ఇంజనీర్స్ అన్ని కేటగిరిస్ పెండింగ్ బిల్లులు వంద శాతం వసూలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఈ కన్‌స్ట్రక్షన్, డివిజన్ ఇంజనీర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బోథ్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోథ్, పొచ్చెర సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రవణ్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

.. ఖానాపూర్‌లో జాబ్ మేళా

ఇంద్రవెల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): శనివారం ఖానాపూర్‌లో నిర్వహించే మెగా జాబ్‌మేళాను మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఖానాపూర్‌లోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను మండలానికి చెందిన పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు రాజకీయాలకు అతీతంగా మెగా జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రమదానంతో పిచ్చిమొక్కల తొలగింపు

ఉట్నూర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో శ్రమదానంతో తపాలా సిబ్బంది శుక్రవారం పిచ్చిమొక్కలు తొలగించారు. తపాల కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలు పెరగడంతో క్రిమికీటకాలతో పాటు కార్యాలయం ఆవరణ అపరిశుభ్రంగా ఉంటుందని భావించిన పోస్టుమాస్టర్ మల్లెపూల మోహన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. పిచ్చిమొక్కలు తొలగించిన ప్రాంతంలో మొక్కలు నాటారు.

వాడీవేడిగా దిశా సమీక్షా సమావేశం

● విద్యా, వైద్యంపై ప్రత్యేకదృష్టిని సారించాలి :ఎంపీ గోడం నగేష్ ● ప్రోటోకాల్ పాటించకుండా తమాషా చేస్తున్నారా? : ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ● గృహ నిర్మాణ, మైనింగ్ శాఖల అధికారులపై తీవ్ర ఆగ్రహం పాల్గొన్న కలెక్టర్, ఆయా శాఖల అధికారులు



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్



సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

ఆదిలాబాద్, జూలై11 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులతో నిర్వహించిన దిశా సమీక్షా సమావేశం వాడీవేడిగా సాగింది. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడంనగేష్ అధ్యక్షతన దిశా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతి పై జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి శాఖల వారీగా సమీక్షించారు. మొత్తం 33శాఖల పరిధిలో 53 అంశాలపై చర్చ జరిపారు. మొదట వ్యవసాయ శాఖతో చర్చను ప్రారంభించారు. సాయిల్ హెల్త్‌కార్డులు, యూరియా ఎరువుల కొరతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ గోడంనగేష్ మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలదరికి చేరే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమంపై ప్రత్యేకదృష్టిని సారించాలన్నారు. ఏజెన్సీలో గిరిజన విద్యార్థుల పై ప్రత్యేక దృష్టిని సారించి నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్రమంతప్పకుండా పాఠశాలలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజకు ఎంపీ, ఎమ్మెల్యేలను ఎందుకు ఆహ్వానించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోథ్ నియోజకవర్గంలో మండలానికో ఎమ్మెల్యే తయారయ్యాడని మండిపడ్డారు. ఎవరు ప్రజాప్రతినిధులు లేకపోయిన ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నించారు. పొలంబాట రహదారులకు సంబంధించి పీఆర్ అధికారులు తప్పుతోవ పట్టిస్తున్నారని అన్నారు. అంచనాలు అధికంగా ఉన్న పరిమితంగా ప్రపోజల్స్ అడుగడం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ రోడ్ల క్వాలిటిపై పిర్యా దులు వస్తున్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరించారు. ఇందిరమ్మ కమిటీలపై హైకోర్టు ఇచ్చిన డైరెక్షన్‌ను తెలుసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎలాంటి మైనింగ్ రీచ్‌లు లేక పోయిన ఇసుక అడ్డగోలుగా అమ్ముకుంటున్నా మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మైనింగ్ ఏడీ ఇస్తున్న సమాధానం సంతృప్తికరంగా లేదన్నారు. జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్ ఎక్కడెక్కడ ఉన్నాయో? చెప్పాలని అడుగగా మైనింగ్ అధికారి సమాధానం ఇవ్వక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోనిచాబ్రా, డీఎఫ్ఓ బాజీరావ్‌పాటిల్, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ రాథోడ్ రవీందర్, పీఆర్ ఈఈరాథోడ్ శివరాం, విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్‌చౌహాన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● అర్హత లేని వాళ్లతో భూమిపూజ : అనిల్ జాదవ్, ఎమ్మెల్యే

ఎలాంటి అర్హత లేని వాళ్లతో అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేయిస్తున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోథ్ నియోజక వర్గంలో తనకు ఎలాంటి సమాచారం లేదని మండిపడ్డారు. గృహనిర్మాణ శాఖ అధికారులు తీరు మార్చుకోకుంటే స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఎలాంటి పదవులు లేకున్నా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, కేవలం గృహ నిర్మాణ శాఖలోనే ఇబ్బందికరంగా ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అడేగామ(కే) గుంతలను పూడ్చివేసి చదును చేస్తున్న ట్రాక్టర్

స్పందించారు.. రోడ్డు బాగు చేశారు

ఇచ్చోడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని అడేగామ(కె) గ్రామం మీదుగా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై నీరెళ్లే దారిలేక రోడ్లపై మడుగులు గా మారిన రహదారిపై గత నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కదిలారు. దీనిలో భాగంగా గ్రామస్థులు రహదారి పరిస్థితిని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌కు విన్నవించగా.. ఎంపీ చొరవతో ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డుకు మరమ్మతులు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. దీంతో శుక్రవారం అధికారులు రోడ్డును బాగు చేయించారు. అంతేకాకుండా రాకపోకలకు అంతరాయం కలగకుండా కంకంర వేసి నీటి మడుగులను లేకుండా చేశారు.



కనుగుట్టలో భోజనం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కనుగుట్ట పాఠశాల రోడ్డు పరిశీలన

బోథ్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామంలోని పాఠశాలకు వెళ్లి రోడ్డంతా బురదమయంగా మారడంతో 'ఆంధ్రజ్యోతి'లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల గురించి గత మూడు రోజుల క్రితం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో రమేష్ ఎంపీ ఈవో అతుల్ కుమార్‌లతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు అవుతున్న తీరును ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని విద్యార్థులకు వేడి భోజనాన్ని వడ్డించాలని సూచించారు. అంతేగాక వంటలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



వాగులో నుంచి వెళ్తున్న ఝరి వైద్య సిబ్బంది

వాగులు, వంకలు దాటి.. వైద్యం

నార్నూర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ప్రజలు రోగాల బారీన పడకుండా ముందస్తుగా గ్రామంలో ఝరి ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బంది వాగులు, వంకలు దాటి వెళ్లి వైద్యం సేవలు అందిస్తున్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలో అర్జుని మారుగూడ వద్ద అర్ఎఫ్ఎస్ క్యాంపు నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ సంజయ్ ఆడె మాట్లాడుతూ వర్షాల పట్ల జాగ్రత్త ఉండాలన్నారు. రోగాలు బారీన పడితే దగ్గర ఉన్న ప్రభుత్వ వైద్య ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలన్నారు. గర్భిణులు, మహిళలు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగేలా చూడాలని, సహాయం కోసం అందుబాటులో ఆశా కార్యకర్తలు ఉంటారని పేర్కొన్నారు. ఆయన వెంట సులోచన, రత్న, సురేఖ, మోహన్, ఆశ సురబాయి ఉన్నారు.

'కు.ని. విధానాలు అవలంబించాలి'

బజార్‌హత్నూర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబం కుటుంబ నియంత్రణ విధానాలను అవలంబించాలని డాక్టర్ మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమం పురస్కరించుకుని ఆమె మాట్లాడారు. పరిమిత కుటుంబంతోనే కుటుంబ ఆర్థికాభివృద్ధి సాధ్యపడు తుందన్నారు. ఆరోగ్య శాఖ ద్వారా కొనసాగుతున్న సేవలని ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు. హెచ్‌ఈవో సూర్యప్రకాష్, సిబ్బంది సంఘవి, అభిషేక్, గంగుబాయి, సంగీత, ఆశా కార్యకర్తలున్నారు.

'పేదలకు పథకాలు అందేలా చర్యలు'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ఎవరైతే పేదవాళ్లు ఉన్నారో వారికి పథకాలు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీరామ్ కాలనీలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసి ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు లేక బాధపడుతున్న నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు అందించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నియోజక వర్గంలో దాదాపు 4,800 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. సాధ్యమైనంత త్వరగా మంజూరైన ఇళ్లను పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. ధోని జ్యోతి, జోగు రవి, ప్రశాంత్, నరేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే